ప్రజాశక్తి

శనివారం 6 జులై 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పడగవిప్పిన డయేరియా

బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

- మోటూరుపాలెంలో 18 మందికి వాంతులు, విరేచనాలు
- కలుషిత ఆహారమే కారణం
- కెజిహెచ్ సహా పలు ఆసుపత్రుల్లో బాధితులు
- మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి - అచ్యుతాపురం

మండలంలోని సెజ్ పునరావాస కాలనీ మోటూరుపాలెంలో డయేరియా పడగవిప్పింది. కలుషిత ఆహారం తినడం వల్ల 18 మంది ఇప్పటి వరకూ డయేరియా బారినపడ్డారు. వారంతా వాంతులు, విరేచనాలతో మంగళవారం నుంచీ అస్వస్థతకు గురవుతూ వస్తున్న విషయం శుక్రవారానికి గుప్పుమంది. తొలుత సాధారణ అనారోగ్యమే అనుకున్నప్పటికీ మూడు రోజులుగా బాధితులు పెరుగుతుండటంతో వైద్యులు అప్రమత్తమయ్యారు. డయేరియా సోకినట్టు వారు తెలిపారు.

కారణమేంటి ?

గ్రామానికి వచ్చిన ఓ చిల్లర వర్తకుని వద్ద సోమవారం కొంతమంది బజ్జీలు కొనుగోలు చేశారు. అవి తిన్న ఆ రాత్రి నుంచే వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించాయి. వారంతా ఇంటి బయట బహిరంగ ప్రదేశంలో మూత్ర, మల విసర్జన చేస్తూ వచ్చారు. అక్కడే వాంతులు చేసుకున్నారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఈగలు పెరిగి చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించాయి. అవి జనం తినే ఆహార పదార్థాలపై వాలడంతో డయేరియా ప్రబలింది. మంగళవారం ఉదయానికి కొంతమంది ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరారు. ఇలా క్రమేపీ ఆసుపత్రుల్లో చేరిన వారి సంఖ్య శుక్రవారానికి పెరిగింది. గ్రామంలో వ్యాధి లక్షణాలు తీవ్రమవడంలో ఎంపిడిఒ సురేష్ కుమార్ దృష్టికి వైద్య సిబ్బంది సమస్యను తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ బాలాజీ, డిఐఒ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సతీష్, డాక్టర్ విజయ్ కుమార్ గ్రామాన్ని సందర్శించారు. వైద్య మిగతా 2లో..

గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ప్రజలకు అందుబాటులో ఉంటా

బాధ్యతల స్వీకరణలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి - అనకాపల్లి : రాష్ట్రంలో అనకాపల్లి జిల్లా అన్నింటా ముందుండేలా నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరిస్తానని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా నూతన కలెక్టర్‌గా ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వేద పండితులు ఆశీర్వచనాలు పలుకుతూ ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పలువురు జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగత శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తొలుత ఆమె అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ సహాయక కమిషనర్ బండారు ప్రసాద్ ఆమెకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపినవారిలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ఎస్‌పి కెవి.మురళీకృష్ణ, ఎఎస్‌పి విజయభాస్కర్, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, అనకాపల్లి రెవిన్యూ డివిజనల్ అధికారి చిన్నికృష్ణ, నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి హెచ్‌బి.జయరామ్, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ ఎఒ బి.రాజేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

సంతకం చేస్తున్న విజయకృష్ణన్

కెకె.లైన్‌లో రైళ్లు రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్‌లోని కెకె.లైన్‌లో భద్రతా సంబంధిత ఆధునికీకరణ పనుల కారణంగా 08551 విశాఖపట్నం-కిరండూల్ రైలును జులై 8న, 08552 కిరండూల్-విశాఖపట్నం రైలును జులై 9న రద్దు చేశారు. ప్రజలు ఈ మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ అభ్యర్థించారు.

నగరంలో 'కల్కి బుజ్జి' సందడి

▶ వార్త 2లో..

ముగిసిన సురభి నాటకోత్సవాలు

▶ వార్త 2లో..

10న డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

▶ వార్త 2లో..

ఫార్మా వ్యర్థ రసాయన జలాలతో నిండిన గెడ్డను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ఫార్మా వ్యర్థాలను ఇష్టానుసారంగా విడిచిపెడుతున్న..

రాంకీపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పరవాడ : ఫార్మా వ్యర్థ రసాయనిక జలాలను ఇష్టానుసారంగా గెడ్డల్లోకి, చెరువుల్లోకి విడిచిపెడుతున్న రాంకీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఆయన పరవాడ - భరిణికం గ్రామాల మధ్య ఉన్న మొల్లోడు గెడ్డను శుక్రవారం సందర్శించారు. ఫార్మా వ్యర్థ రసాయన జలాలతో ఆ ప్రాంతం తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండటాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా రసాయనిక వ్యర్థ జలాలను శుద్ధి చేసి సముద్రంలోకి పంపించాల్సి ఉండగా చెరువులు, గెడ్డల్లోకి మిగతా 2లో..

బిఎస్ఎన్ఎల్ వైపు పలువురి చూపు

ప్రైవేట్ టెలికం కంపెనీలు రీఛార్జ్ ధరలు పెంచడంతో వినియోగదారులపై విపరీత భారం

మండిపడుతున్న మొబైల్ యూజర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రైవేటు టెలికం కంపెనీలు రీఛార్జ్ ధరలను ఎడాపెడా పెంచేయడంతో వినియోగదారులు ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్‌వైపు చూస్తున్నారు. ఇప్పటికే పలువురు బిఎస్ఎన్ఎల్‌కు మారినట్టు బాహాటంగా చెబుతున్నారు. వాస్తవానికి 2024 ఎన్నికలు అయిపోయాక జనంపై ధరల బాదుడు మొదలైంది. ప్రైవేట్ టెలికం దిగ్గజ సంస్థలైన జియో, టెలికం, వొడాఫోన్ ఐడియా బరితెగింపు స్పష్టంగా కనిపిస్తోంది. ఒక మొబైల్ వినియోగదారుడు ఇంతవరకూ రెండు నెలలకుగానూ చెల్లించే రీఛార్జ్, డేటా ధరను ఇక నుంచి ఒక్క నెలకే చెల్లించేలా ప్లాన్‌లను మలిచి ఈ నెల 3 నుంచి సదరు సంస్థలు భారం మోపాయి. పై మూడు ప్రైవేట్ దిగ్గజ సంస్థలు కూడబలుక్కుని సిండికేట్‌గా మారి మొబైల్ యూజర్లపై దాడికి తెగబడినట్టు పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

బిఎస్ఎన్ఎల్‌కు మిగతా వాటికీ ఎంత తేడా ?

బిఎస్ఎన్ఎల్ రూ.249 ప్లాన్‌ను 45 రోజులకు అన్‌లిమిటెడ్ ఫోన్ కాల్స్‌తో కలిపి రోజుకు 2 జిబితో ఇస్తుంటే... ఎయిర్‌టెల్, జియో కేవలం 28 రోజులకు రూ.230ను కస్టమర్ల నుంచి గుంజుతున్నాయి. అలాగే బిఎస్ఎన్ఎల్ 108తో 28 రోజుల ప్లాన్‌ను రోజుకు ఒక జిబితో ఇస్తుంటే ఇదే ప్లాన్‌కు జియో రూ.239 వసూలు చేస్తోంది. ఎయిర్‌టెల్ కంపెనీ కూడా ఇదే రకంగా గుంజుతోంది. మొత్తంగా రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ రెండూ తమ టారిఫ్లను భారీగా పెంచాయి. రిలయన్స్ జియో తన టారిఫ్‌ను 12 శాతం నుంచి 25 శాతానికి పెంచగా, ఎయిర్‌టెల్ 11 నుంచి 21 శాతానికి పెంచింది. ఈ తీరుపై వినియోగదారులు భగ్గుమంటున్నారు.

కుటుంబంపై తీవ్ర ఆర్థిక భారం

మా ఒక్క ఇంటిపైనే నెలకు రూ.1500 భారం అదనంగా పడనుంది. మొదట్లో జియో ఫ్రీ అని చెప్పి అలవాటు చేసి ఇప్పుడు ధరల భారం మోపడం తగదు. నా భర్త, ఇద్దరు పిల్లలు కలిపి నాలుగు ఫోన్‌లను వాడుతున్నారు. ఇప్పటికే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పడగవిప్పిన డయేరియా

శిబిరం ఏర్పాటు చేశారు.

బాధితులు ఎక్కడెక్కడ ?

బాధితుల్లో కక్కల మేఘన, పంచదారల నాగమణి, పంచదారల ఫణీంద్ర, కక్కల వినయ్, కక్కల అశ్వినిలను విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అనకాపల్లి ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో కక్కల రమ్య, దమ్ము సాయి, డొక్క అప్పలనర్సమ్మ చికిత్స పొందుతున్నారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముప్పిడి భవ్య, ముప్పిడి ఝాన్సీ, ముప్పిడి వంశీ, ముప్పిడి సురేష్, డేవిడ్ రాజ్, నూకరత్నంలకు డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. డయేరియా లక్షణాలు కనిపించిన వెంటనే అప్రమత్తమైనట్టు వైద్యులు పేర్కొన్నారు. డయేరియా సోకిన విషయం తెలిసి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శుక్రవారం మోటూరిపాలెం గ్రామాన్ని సందర్శించారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పొందుతున్న డయేరియా వ్యాధిగ్రస్తులను పరామర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహశీల్దార్ రజిని, ఎంపిడిఒ సురేష్ కుమార్ ఉన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అధికారులను కోరారు. గ్రామ పరిసరాలను శుభ్రపరచాలని, డయేరియాపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిల్వ ఆహార పదార్థాలు విక్రయించేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఆహార తనిఖీ అధికారులు చోద్యం చూస్తుండటం వల్లే ఇటువంటి పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు.

బిఎస్ఎన్ఎల్ వైపు పలువురి చూపు

రూ.600 భారం నెలవారీ ఉండగా పెరిగిన రీ ఛార్జీ డేటాతో రూ.1200 నుంచి రూ.1500 వరకూ భారం పడనుంది. ఇలా ఛార్జీలు పెంచడం దారుణం.

జెస్సీ సుమధానం, గృహిణి, కెఆర్ఎం కాలనీ

ఇప్పటికే భారాలతో సతమతం

ఇప్పటికే మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలూ పెరిగిపోయి సతమతమవుతున్నాం. ఈ తరుణంలో మొబైల్ చార్జీలు పెరగడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. నాకు 2 సిమ్‌లు ఉన్నాయి. ఒకటి ఎయిర్‌టెల్. రెండోది బిఎస్ఎన్ఎల్. ఈ నెల వరకు నెలకు 500 రీఛార్జికి అయ్యేది, ఇప్పుడు కొత్త ఛార్జీల ప్రకారం ఎయిర్‌టెల్‌కు అదనంగా వెచ్చించాల్సిన పరిస్థితి. పోనీ సిగ్నల్ బాగుంటుందా అంటే అదీ లేదు.

గోడి జయ ప్రకాశ్, ఎయు పీజీ విద్యార్థి

ప్రభుత్వం సహకరిస్తే బిఎస్ఎన్ఎల్‌కు పూర్వవైభవం

ప్రైవేట్ టెలికం సంస్థలు డేటా ఛార్జీలను పెంచుకుంటూ పోతుంటే బిఎస్ఎన్ఎల్ మాత్రం పాత ఛార్జీలనే అమలు చేస్తూ వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తోంది. టెలికం రంగంలో ప్రైవేటీకరణను కేంద్రం అనుమతించిన ఫలితంగా ప్రజలపై ఆ సంస్థలు ఎడతెగని ఆర్థిక భారాలు మోపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నియంత్రించడం లేదు. ఆగస్టు 15 నాటికి బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. టవర్‌ల సేకరణ జరుగుతోంది. సాంకేతిక సమస్యలు అధిగమిస్తున్నాం. దండుబజార్ దగ్గర కొత్తగా టవర్ ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి. బిఎస్ఎన్ఎల్‌కు ప్రభుత్వం తగు ప్రోత్సాహం అందిస్తే పూర్వవైభవం సాధ్యం.

– సిహెచ్‌వి.సాగర్,
బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, విశాఖపట్నం

రాంకీపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

నిబంధనలకు విరుద్ధంగా రాంకీ యాజమాన్యం విడిచిపెడుతోందన్నారు. భూగర్భ జలాల పరిరక్షణకు తక్షణం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు జి.శ్రీనివాసరావు ఉన్నారు.

10న డిమాండ్స్ డేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : కేంద్ర బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 10న తలపెట్టిన డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం పచ్చి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తెలిపారు. కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌ను ఎలాగైనా అమలు చేయాలని చూస్తోందన్నారు. దీనిలో భాగంగానే యాజమాన్యాలకు లాభాలు చేకూర్చేందుకు అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. కార్మికులకు రోజురోజుకూ సమస్యలు పెరుగుతూ వస్తున్నాయని తెలిపారు. వాటి పరిష్కారం కోరుతూ 10న కార్మికులు ఫ్యాక్టరీల వద్ద, పని ప్రదేశాల్లో, ముఖ్యమైన కూడళ్లలో నిరసన తెలపాలని విజ్ఞప్తి చేశారు.

7న ఇస్కాన్ రథయాత్ర

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : పూరీ తరహాలో ఈ నెల 7న విశాఖలో ఇస్కాన్ సాగర్‌నగర్ యూనిట్ ఆధ్వర్యంలో రథయాత్ర నిర్వహించనున్నట్టు ఆ సంస్థ నగరాధ్యక్షులు సాంబదాసు తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 ఏళ్లగా దిగ్విజయంగా యాత్రను నిర్వహిస్తున్నామని, ఈసారి యాత్రకు ఎపి హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నట్టు తెలిపారు.

నగరంలో 'కల్కి బుజ్జి' సందడి

ప్రజాశక్తి – ఆరిలోవ : ఇటీవల విడుదలైన ప్రభాస్ కల్కి సినిమాలో వినూత్న ఆకృతిలో కనిపించి అందరినీ ఆకట్టుకున్న వాహనం బుజ్జి శుక్రవారం పాత డెయిరీ ఫారంలోని విశాఖ వ్యాలీ స్కూలులో సందడి చేసింది. ఆ వాహనం మేకర్, యూనిట్ సభ్యుడు రమేష్ బుజ్జిని నడిపారు.

విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, ప్రభాస్ అభిమానులు కేరింతలు కొడుతూ సంతోషాన్ని ఆస్వాదించారు. వాహనం ప్రత్యేకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వాహనం పూర్తిగా ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్‌తో తయారు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. గంటకు సుమారు 40 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ వాహనం ఆరున్నర టన్నుల బరువు, 6 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు ఉంది. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో మహేంద్ర, జయం కంపెనీలు కోయబత్తూరులో

బుజ్జి వద్ద సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు

దీనిని తయారు చేసినట్టు డిజైన్ మేకర్ రమేష్ తెలిపారు. ఈ వాహనానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన టైర్లను సియట్ కంపెనీ తయారుచేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

1191వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

దీక్షలో కూర్చున్న నాయకులు

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని, ప్లాంట్‌కు అవసరమైన సొంత గనులను కేటాయించాలని సిఐటియు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 1191వ రోజుకు చేరాయి. దీక్షల్లో మద్దిలపాలెం జోన్ సిఐటియు నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకొని స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలన్నారు. దీక్షల్లో వి.కృష్ణారావు, ఎ.సీతాలక్ష్మి, పీతల అప్పారావు, అనపర్తి అప్పారావు, కె.కుమారి, శివ పాల్గొన్నారు.

ముగిసిన సురభి నాటకోత్సవాలు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : భానోదయ నాట్య మండలి (సురభి) హైదరాబాద్ సభ్యుల ఆధ్వర్యంలో విశాఖపట్నం కళాభారతి ప్రాంగణంలో రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న సురభి నాటకోత్సవాలు శుక్రవారం మాయాబజార్ నాటక ప్రదర్శనతో ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ రంగస్థల నటి ఆలపాటి లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాయాబజార్ నాటకం ఆద్యంతం ప్రేక్షకలోకానికి మైమరపు, గిలిగింతల ఆహ్లాదం, మనోరంజక దృశ్య మాలికల సమాహారంగా సాగి మరిచిపోలేని అనుభూతిని మిగిల్చిందన్నారు. సురభి కుటుంబీకులకు మాత్రమే చెల్లిన ఇంత గొప్ప సంస్కృతిని విశాఖ ప్రజలకు అందివ్వడంలో కీలక భూమిక వహించిన బాదంగీర్ సాయిని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో రంగ సాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి, కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి రాంబాబు, ఆర్‌టిఐ పూర్వ కమిషనర్ మాడభూషి శ్రీధర్, రైటర్స్ అకాడమీ వ్యవస్థాపకులు వివి.రమణమూర్తి. దాడి సత్యనారాయణ, రాపేటి అప్పారావు పాల్గొన్నారు. సురభి కళాకారులను అతిథులు సత్కరించారు.

సెవెన్ హిల్స్ ఎదుట కార్మికుల నిరసన

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : నగరంలోని సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో తొలగించిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లేదా సెటిల్మెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హాస్పిటల్ ఎదుట ముగ్గురు కార్మికులు నిరసన తెలిపారు. వెంకటరావు, రాజు, లక్ష్మణల ఉద్యోగాలను కాంట్రాక్టర్ కొద్దిరోజుల క్రితం తొలగించారు. కార్మికుల సమస్యలపై గతంలో వీరు బహిరంగంగా నిరసన తెలపడాన్ని ఆయన సహించలేకపోయారు. ఈ క్రమంలోనే కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. వారి పోరాటానికి సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి సంఘీభావం తెలిపారు.

సిపి ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్‌లో ఎల్లవేళలా తగు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు, పెండింగ్ కేసులను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. అన్ని రిజిస్టర్లు అప్డేట్‌గా ఉండాలన్నారు. సిబ్బందికి ఏ సమస్య ఉన్నా తాము ఇచ్చిన 7995095799 నెంబరుకు తెలియజేయాలన్నారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. విధి నిర్వహణలో అంకితభావంతో మెలగాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీస్ కవాతు పరిశీలన

నగరంలోని ఆర్మ్డ్ రిజర్వ్ మైదానంలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది కవాతును శంఖబ్రత బాగ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వారి గౌరవ వందనం స్వీకరించి, పెరేడ్‌ను వీక్షించారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIAKAKULAM
H.M.O.P: 59/2024.

Between:
Challa Anil ...Petitioner.
And
Challa Asha ...Respondent.
To,
Respondent is:-
Challa Asha, W/o Challa Anil, aged about 25 years, Household duties, resident of door No: 4-3-302, M.A Nagar, Maduravada, Visakhapatnam Town and District.

Please take notice that the above HMOP.59/2024 matter is posted to **22-07-2024** for your appearence. So you are here by directed to appear before the above court **at 10:30 AM., on 22-07-2024** in person or through Advocate without fail. otherwise the mattar will be decided in your absence

// BY COURT ORDER. //

P. HARSHAVARDHAN
ADVOCATE, SRIKAKULAM,
CELL: 9515975111.

IN THE HONOURABLE COURT OF THE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT SRIKAKULAM
E.A. 5/2024 in C.C.78/2023

Between: **A.1 Hospital (Akhila Memorial Hospitals),** represented by its Manager Bondilipuram, Srikakulam Town and District.
---Dhr/Complainant
And: **SS Enterprises represented by its Manager,** ---Jdr'sOpposite Parties

To,
JDR:1. SS Enterprises represented by its Manager, Door No.50-73-30, Kanakammavaari Street, Seethammapeta, Visakhapatnam-530 016,
JDR:2. SS Enterprises represented by its Managing Partner/Proprietor, D.No.50-73- 30, Kanakammavaari Street, Seethammapeta, Visakhapatnam-530 016.

Please take notice that the above EA.5/2024 in CC.78/2023 matter is posted to **11-07-2024** for your appearence. So you are here by directed to appear before the above court **at 10:30 AM., on 11-07-2024** in person or through Advocate without fail. otherwise the mattar will be decided in your absence

// BY COURT ORDER. //

B.V.A NAIDU
ADVOCATE, SRIKAKULAM,
CELL: 9491134780.

జీవనశైలి మార్పులతో కేన్సర్ దూరం

మాట్లాడుతున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి – గాజువాక : మంచి ఆహారపు అలవాట్లుతో కేన్సర్ వ్యాధి రాకుండా దూరంగా ఉండొచ్చని ఎంవిఆర్ కళాశాల రిటైర్డ్ కెమిస్ట్రీ హెచ్ఒడి కె రామ్మోహనరావు అన్నారు. శుక్రవారం గాజువాక ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కేన్సర్‌పై ప్రజల్లో అవగాహనకు తాను ఇప్పటివరకు వివిధ దేశాల్లో 199 సార్లు ప్రసంగించానని, ఇది 200వ ప్రసంగమన్నారు. కేన్సర్‌ను ఖర్గరోగమని పిలుస్తారని, జీవనశైలిలో మార్పులు చేసుకుంటే కేన్సర్ మహమ్మారి దరిచేరదన్నారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. అవగాహన సదస్సులో కరస్పాండెంట్ వి రామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ వై ఈశ్వరరాజు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల ఏర్పాటు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, టి నగరపాలెం గొల్లపాలెంలోని శివాలయం, శ్రీకృష్ణ మందిరం వద్ద భక్తుల సౌకర్యార్థం శుక్ర వారం రూ 15 వేలు విలువైన సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. పంచాయతీ వార్డు సభ్యులు పూసర్ల రామారావు, ఇ.నానాజీ, తదితరుల ఆర్థిక సాయంతో ఈ బెంచీలను ఏర్పాటు చేశారు.

తెలుగు భాష పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి -గాజువాక :తెలుగు భాషను పరిరక్షించాలని కవి కె.మల్లేశం అన్నారు. గాజువాక ఎంవిఆర్ కళాశాలలో తెలుగు భాష పరిరక్షణపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా పిలుస్తారని, అటువంటి తెలుగుభాష మనుగడ కోల్పోయే పరిస్థితిలో ఉందన్నారు. తెలుగుభాష అంతరించిపోకుండా చూడాలని, మాతృభాషను కాపాడు కోవాలన్నారు.కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.బాలకృష్ణ, వైస్‌ప్రిన్సిపల్ ఎస్‌వి.కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులకు అవగాహన

ప్రజాశక్తి - పద్మనాభం: మండలకేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులకు ప్రథమ చికిత్స, అత్యవసర వైద్యఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. విజయనగరంకాశ్మీ హాస్పిటల్ అధినేత డాక్టర్ మోపాడ ప్రవీణ్‌కుమార్ పాల్గొని, ప్రమాదాలు జరిగేటప్పుడు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడంపై అవగాహన కల్పించారు.అసోసియేషన్ మండల అధ్యక్షులు రాలి అప్పారావు, సెక్రెటరీ ఎంవి రమణ, కమిటీ సభ్యులు యు తాతబాబు, పి రామారావు, ఎంవి ప్రసాద్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై ఆకస్మిక దాడులు

ప్రజాశక్తి- వేపగుంట : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జివిఎంసి అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. శుక్రవారం జివిఎంసి 92వ వార్డు పెట్రోల్‌బంక్ జంక్షన్‌లోని మాంసం దుకాణాలపై ఎనిమిదో జోన్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు,శానిటేషన్ అధికారులు వెంకటరమణ, గోపి ఆధ్వర్యంలో దాడులు చేసి, ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న మాంసం దుకాణదారులపై కులు నమోదు చేశారు. ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. దుకాణాల వద్ద విధిగా రెండు చెత్తబుట్టలను ఉంచాలని, ప్లాస్టిక్ కవర్లు వాడడం మానేసి, గుడ్డ, ఇతర ప్రత్యామ్నాయ సంచులను వినియోగించాలని సూచించారు.

రోడ్డు ఆక్రమణ ఫిర్యాదుపై టౌన్ ప్లానింగ్ అధికారుల పరిశీలన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు సాయికృష్ణ ట్రావెల్స్ పక్కన గల భవన నిర్మాణదారుడు మాస్టర్ ప్లాన్ 30 అడుగుల ప్రాంతంలో ఉన్న స్థలాన్ని ఆక్రమించి సిమెంట్ మెట్లు మార్గాన్ని నిర్మిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు జివిఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం పరిశీలించినట్లు టిపిఒ ప్రమీల తెలిపారు. మాస్టర్ ప్లాన్ 30అడుగుల రోడ్డును ఆక్రమించి, ఇంటికి ఒకవైపున మెట్ల మార్గాన్ని నిర్మిస్తున్నారని, దీంతో డ్రైనేజీ పూర్తిగా కప్పుడై వర్షాకాలంలో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని రామకృష్ణ అనే అడ్వకేట్ ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్‌రోడ్డు ఆక్రమణతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జివిఎంసి టౌన్‌ప్లానింగ్ ఎసిపి ఎస్.వెంకటేశ్వరరావు, టిపిఒ ప్రమీల వచ్చి పరిశీలించారన్నారు. అయితే భవన యజమాని తమ వద్ద ఆధారాలున్నాయని చెప్పడంతో వాటిని తెచ్చి చూపించాలని సూచించినట్లు టిపిఒ ప్రమీల తెలిపారు. కాగా ఇదే నిర్మాణాన్ని గతంలో జివిఎంసి కమిషనర్‌గా లక్ష్మీషా ఉన్నప్పుడు పరిశీలించి, మాస్టర్‌ప్లాన్ 30అడుగులలో ఉండడంతో పాతదైన ఈ భవనానికి టిడిఆర్‌ను సంబంధిత యజమానికి చెల్లించి, కూల్చేయాలని సూచించినట్లు సమాచారం, ఇపుడు అదే భవనం వద్ద అక్రమ మెట్లమార్గం నిర్మాణం చేపడుతుండడంతో అందిన ఫిర్యాదులపై అధికారులు పరిశీలించి వెళ్లారు. రికార్డుల ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామన్నారు.

రోడ్డు వైపున నిర్మించిన ఇనుప మెట్ల మార్గం

వేతనాల చెల్లింపుల్లో వ్యత్యాసం తగదు!

ఐదో తేదీ నాటికి జీతాలు అందక ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు ఉద్యోగుల ఆవేదన

ప్రజాశక్తి- విశాఖపట్నం : రాష్ట్రంలో అందరు ఉద్యోగుల ఖాతాల్లో ఈనెల ఒకటి, రెండు తేదీల్లో వేతనాలు పడినప్పటికీ, తమకు మాత్రం ఐదో తేదీ వరకు జీతాలు ఇవ్వలేదని నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న వైద్యఆరోగ్యశాఖ కాంట్రాక్టు సిబ్బంది ఆవేదన చెందుతున్నారు. ఈమేరకు ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎంవివి. గోపీనాథ్, ప్రధాన కార్యదర్శి వి. వీరబ్రహ్మం విడుదల చేసిన ప్రకటనలో, రాష్ట్రంలో దాదాపు 22 వేలమంది, ఉమ్మడి విశాఖ జిల్లాలో 1500మంది కాంట్రాక్టు ఉద్యోగులు నేషనల్ హెల్త్ మిషన్ కింద యుపిహెచ్‌సిలు, టిబి విభాగం, ఇతరత్రా చోట 186రకాల వివిధ కేడర్‌లలో పనిచేస్తున్నారన్నారు. తమకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 భాగస్వామ్యంతో జీతాలు చెల్లిస్తున్నాయన్నారు. అయితే జూన్ నెల వేతనాలు ఇంత వరకు చెల్లించకపోవడంతో పిల్లల స్కూల్ ఫీజులు, ఇతరత్రా అవసరాలకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమ వేతనాల చెల్లింపులకు చర్యలు చేపట్టాలని వేడుకున్నారు.

ఒకే కేడర్‌లో పనిచేస్తున్నప్పటికీ తమకు ప్రభుత్వ ఉద్యోగుల కంటే తక్కువ వేతనాలను చెల్లిస్తున్నారని, సుప్రీంకోర్టు సూచనల మేరకు సమానపనికి సమాన వేతనం, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఏటా ఐదుశాతం ఇంక్రిమెంట్ చెల్లించేలా చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోపీనాథ్, వీరబ్రహ్మం డిమాండ్ చేశారు.

వార్షిక క్యాలెండర్ ప్రకారం పాఠ్యాంశాల బోధన

ప్రజాశక్తి -భీమునిపట్నం :వార్షిక క్యాలెండర్ ప్రకారం పాఠ్యాంశాలను బోధించాలని మండల విద్యాశాఖాధికారులు ఎం.శివరాణి, జయప్రద ఉపాధ్యాయులకు సూచించారు.

శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సూచనలు చేశారు. సమయపాలన పాటించాలని, బయో మెట్రిక్ వేయాలని, బేస్‌లైన్ పరీక్షలు జరపాలని, ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి నెలా తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలన్నారు. డిక్టేషన్, చేతిరాతపై ప్రత్యేకదృష్టి పెట్టాలని సూచించారు. గుణాత్మకవిద్యను అందించాలని, విద్యార్థులకు క్రమశిక్షణ, ఓర్పు నేర్పించాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పి.మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో 'లంపి' వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-పద్మనాభం: .మండలంలోని రెడ్డిపల్లి పశు వైద్యశాల పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు వంద పశు వులకు వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం లంపి చర్మవ్యాధికి వ్యాక్సినేషన్ వేశారు. ఏటా జులైనెలలో వేసే ఈ వ్యాక్సినేషన్‌ను పాడిపశువుల పెంపకందారులు వినియోగించుకోవాలని సూచించారు. లంపి చర్మవ్యాధి సోకిన పశువుల శరీరంపై బొడిపెలు రావడం, జ్వరం వల్ల మేత తినకపోవడం, కాళ్లవాపు, పాల ఉత్పత్తి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇలాంటి వ్యాధులు రాకుండా వ్యాక్సినేషన్ చేయించాలన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ కన్నయ్య ఉన్నారు.

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం, దాకమర్రి ఆర్‌బికె వద్ద శుక్రవారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు సంకురు భక్త ప్రకాష్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. నాణ్యమైన వరి విత్తనాలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, ఆర్‌బికె సిబ్బంది, పార్టీ నాయకులు అల్లు చిన్నయ్య, సిహెచ్ నాని పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు నేడు ఉచిత వ్యాక్సినేషన్

ప్రజాశక్తి- తగరపువలస : జోనోసిస్‌డే సందర్భంగా ఈ నెల6న శనివారం స్థానిక పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా వేయనున్నట్లు దాకమర్రి పశు వైద్యాధికారి డాక్టర్ కాంతికిరణ్ తెలిపారు. దీనిపై దాకమర్రి, మజ్జివలస తదితర గ్రామాల్లో శుక్రవారం అవగాహన కల్పించారు. సమీపంలోని రైతుభరోసా కేంద్రాల్లోనూ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తారని, కుక్కల పెంపకదారులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఏఆర్‌వి వేయాల్సిన అవసరాన్ని వివరించారు.

రీడింగ్ రూమ్ ను వినియోగించుకోండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఉన్న రీడింగ్ రూమ్‌ను వినియోగించుకోవాలని హెచ్ఎం పి రమణ విద్యార్థులకు సూచించారు. వివేకానంద రీడింగ్ రూమ్‌లో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు

నేరాలు ఘోరాలు

చెరువులో మునిగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఎన్ నరసాపురం గ్రామానికి చెందిన మనబాల సత్తిబాబు (56) గురువారం సాయంత్రం ఉపమాక చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందినట్లు ఎస్ఐ సన్ని బాబు శుక్రవారం వెల్లడించారు. మనబాల సత్తిబాబు గురువారం సాయంత్రం ఉపమాక చెరువులో స్నానానికి దిగి ,ప్రమాదవశాత్తు చెరువులో మునిగి పోయాడని, స్థానికులు గుర్తించి బయటకు తీసేటప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరహానదిలో మృతదేహం గుర్తింపు

ప్రజాశక్తి - యలమంచిలి : మండలంలోని ఏటికొప్పాక వద్ద వరహానదిలో 50-55 సంవత్సరాల వయసున్న పురుషుడి మృతదేహం కొట్టుకొచ్చినట్లు యలమంచిలి రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. మృతుడి తెల్ల చొక్కా మీద నర్సీపట్నానికి చెందిన శ్రీకన్యా టైలర్ స్టిక్కర్ ఉందని పేర్కొన్నారు. తెల్ల పంచె కట్టుకున్న బట్టతల ఉన్నట్లు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన వారు మృతుని ఆచూకీ తెలిస్తే యలమంచిలి రూరల్ పోలీసుల్ని సంప్రదించాలని కోరారు.

20 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పెందుర్తి : పినగాడి జంక్షన్‌లో నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో ఒక మహిళ నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఏసిపి నరసింహామూర్తి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ, ముందస్తుగా అందిన సమాచారం మేరకు పినగాడి జంక్షన్‌లో స్థానిక పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ముంచంగిపుట్టు నుంచి ఒక మహిళ తెస్తున్న గంజాయిని చాకచక్యంగా పట్టుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

కాగా గంజాయి అక్రమ రవాణాతోపాటు వారిని ప్రోత్సాహిస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం మహిళ నుంచి గంజాయిని స్వాధీనం చేసుకోగా, ఆమె ఎక్కడి నుంచి ఎవరి ప్రోత్సాహంతో ఎక్కడికి తీసుకువెళుతుందనే అన్ని అంశాలపై సమగ్రంగా దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామన్నారు .గంజాయి కేసుల్లో ఉన్నవారి బ్యాంకు ఖాతాలను సీజ్ చేస్తామన్నారు. గంజాయి రవాణా, నిల్వపై సమాచారం అందించి సహకరించాలని, సహకరించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఏసిపి వెల్లడించారు. సిఐ రామకృష్ణ, ఎస్ఐ పాల్గొన్నారు.

దాడి బాధ్యులపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-పద్మనాభం : విధి నిర్వహణలో ఉన్న తనపై దాడిచేసి కొట్టిన వారిపై కేసు నమోదు చేయాలని తహశీల్దార్‌కు, పోలీసులకు, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు బుడ్డివలస గ్రామ సేవకుడు లింగాల సింహాచలం తెలిపారు. గ్రామ దేవత పైడితల్లమ్మ భూవివాదానికి సంబంధించి, గుడి వద్దఎటువంటి నిర్మాణాలు చేపట్ట వద్దని నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన తనపై అదే గ్రామానికి చెందిన బోని అప్పలరాజు, బోని అంకయ్యమ్మ బోని గౌరి దౌర్జన్యంగా దాడి చేసి కొట్టారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై తనకు న్యాయం చేయాలని సింహాచలం కోరుతున్నాడు.

ఎస్‌సి కాలనీలో కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు మూలకుద్దు రోడ్డు పక్కన ఉన్న ఎస్‌సి కాలనీలో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి శుక్ర వారం పర్యటించారు. ఇంటింటికి కుళాయిల ద్వారా సరిపడా తాగునీరు వస్తున్నదీ, లేనిదీ అక్కడున్న మహిళలను అడిగి తెలుసుకున్నారు. తమ తాగునీటి ఇబ్బందులను గుర్తించి కుళాయిలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి అప్పారావు, శివ, వెంకటేష్, యర్రయ్య రెడ్డి పాల్గొన్నారు

ఆందోళన రేకెత్తిస్తున్న ఫాసిజం ఛాయలు!

శతాక్షి కవితల సంపుటి ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

శతాక్షి కవితల సంపుటి ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి- సీతమ్మధార : వందేళ్ల తర్వాత ప్రపంచాన్ని ఫాసిజం మళ్లీ చుట్టుముడుతోందని, ఇటీవల చోటుచేసుకున్న కొన్ని ఘటనలు చరిత్ర పునరావృత మౌతుందాయన్న ఛాయలతో ఆందోళనను రేకెత్తిస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. దీని ప్రభావం ప్రజాస్వామ్యంపైనా, సాహిత్యంపైనా చూపేలా ఉన్నాయన్నారు. శుక్రవారం అరసం విశాఖ శాఖ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆకాశవాణి పూర్వ కార్యక్రమాధిపతి, కవి రొక్కం కామేశ్వరరావు రచించిన 'శతాక్షి' కవితల సంపుటిని శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వేచ్ఛగా మాట్లాడలేనప్పుడు, కవి తన భావాలను కవిత్వం ద్వారా వ్యక్తం చేయవచ్చన్నారు. ప్రస్తుత విద్యా విధానం భాషకు విలువ లేకుండా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాస్వామ్య, మానవతావాదులపై ఉందన్నారు శతాక్షి కవితాసంపుటి వర్తమానకాలానికి ఉపయోగకరంగా ఉంటుందని, యువతరానికి మేము కవిత్వం రాయగలమనే స్ఫూర్తినిస్తుందన్నారు. ఈ పుస్తకంలో కొత్త తరానికి కవి రొక్కం కామేశ్వరరావు సూచనలు చేశారన్నారు. అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాహిత్య విశ్లేషకులు డాక్టర్.జి.వేణు పుస్తకాన్ని సమీక్షించారు. బివికె కాలేజీ విశ్రాంతాచార్యులు డి.వి.సూర్యారావు, అరసం ఉపాధ్యక్షులు ఎస్ హనుమంతరావు, కార్యదర్శులు పి.శ్యామ్‌సుందర్, డాక్టర్ ఎన్.క్షేత్రపాల్‌రెడ్డి ఇతర సభ్యులు పాల్గొని కవి రొక్కం కామేశ్వరరావును సత్కరించారు. వివిధ సంఘాల నేతలు డిఆర్‌కె రావు, బొట్టా అప్పారావు, పల్లా జగదీశ్వరరావు, అడపా రామకృష్ణ, మేడా మస్తాన్ రెడ్డి, ఆచార్య వెలమల సిమ్మన్న, బి.వి.అప్పారావు, ఎస్.హనుమంతరావు, డాక్టర్ కెవిఎస్.మూర్తి, సిహెచ్.చిన సూర్యనారాయణ, కె.మధుసూధన్, తదితరులు కవి రొక్కం కామేశ్వరరావును అభినందించారు. నగరంలోని కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే గణబాబు సమీక్ష

సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి- వేపగుంట/ పెందుర్తి :పశ్చిమ నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే పి.గణబాబు స్థానిక నేతలు, వివిధ విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్షించారు. జివిఎంసి 94వ వార్డు నాయుడుతోటలోని లక్ష్మీ కల్యాణం మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డుల వారీగా నెలకొన్న సమస్యలపై అక్కడి నేతలు, అధికారులను అడిగి తెలుసుకున్నారు.తాగునీరు, విద్యుత్, డ్రైనేజీలు, హౌసింగ్, జివిఎంసి పరిధిలోని ఇతర సమస్యలపై శాఖలవారీగా సమీక్షించి, ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలు సమస్యలతో ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న డ్రైనేజీలు, ప్రహరీ, రక్షణగోడల నిర్మాణాలు బాగోలేవని ఎమ్మెల్యే గణబాబు దృష్టికి స్థానిక నేతలు తీసుకురాగా, అటువంటి ఆరోపణలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజాధనం దుర్వినియోగ పరిచే చర్యలు సహించేది లేదని హెచ్చరించారు.

సమస్యలపై ఆర్ఎంపిల వినతి

మంత్రి కొండపల్లిని అభినందిస్తున్న గ్రామీణ వైద్యుల సంఘం నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేసినట్లు ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జంగం జోషి తెలిపారు. శుక్రవారం విజయనగరంలోని జిల్లా పరిషత్ విశ్రాంత భవనంలో సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి ఆధ్వర్యంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించామన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసు సంఘం తరపున అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆర్ఎంపిల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను సంఘ గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు మంత్రి దృష్టికి తేగా, సానుకూలంగా స్పందించి, సిఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి కర్రి సత్యనారాయణ, మహిళా కార్యదర్శి భవాని, సభ్యులు డేవిడ్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయంగా సర్వీస్ రోడ్డు

ప్రజాశక్తి -ఆనందపురం: అధికారుల నిర్లక్ష్యం, నిర్మాకం వల్ల మండలంలోని వేముల వలస వద్ద సర్వీస్‌రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వేములవలస జంక్షన్‌లో వర్షపు నీరు రోడ్డుపై పోకుండా గతంలో ఉన్న కాలువకు మరమ్మతులు చేపట్టి మధ్యలోనే వదిలేయడంతో రోడ్డు గోతులమయమై ప్రమాదభరితమైందని అంటున్నారు.

వేములవలస పాత బ్రిడ్జి నుంచి విశాఖపట్నం వెళ్లే రోడ్డు మలుపు వద్ద ప్రయాణికులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. పైప్ లైన్ కోసం గోతులు తవ్వి సగం సగం కప్పడంతో మలుపు వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గొయ్యి ఉండిపోయింది. ఇది వాహనదారులకు పూర్తిస్థాయిలో కనిపించని స్థితిలో అటుగా వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు అసంపూర్ణంగా వదిలేసిన కల్వర్టు పనులపై నేషనల్ హైవే, పంచాయతీ అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రైవేట్ విద్యార్థులకు తల్లికి వందనం ఇవ్వాలి

లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న అప్సా నేత

ప్రజాశక్తి -గాజువాక : ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకూ తల్లికి వందనం వర్తింప చేయాలని, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు అప్సా నాయకులు తెలిపారు. అప్సా సంఘ నేతలు వి. సుందరామ్, సుబ్రహ్మణ్యం రాజు, ఎం. జనార్దన్, పి. భాస్కరరావు, రామ్మోహనరావు, గణపతి రావు, శ్రీహరి, మురళీ, సత్యం, మాణిక్యాలరావు లోకేష్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడేళ్లగా ఆర్‌టిఇ చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు పొందిన పిల్లలకు సంబంధించి పీజ్ రీయింబర్స్ మెంట్ చెల్లించాలని కోరారు. 10వ తరగతి పాఠ్యాంశాల్లో హిందీ, సోషల్ సిలబస్ ఎక్కువగా ఉందని, దాన్ని తగ్గించాలని కోరారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల బ్లూ ప్రింట్స్ విడుదల చేయాలని కోరారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందిస్తూ, గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వున్న విధంగా అన్ని అమలు చేసి, చిన్న ప్రైవేట్ బడులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

జూ సిబ్బందికి వైద్య పరీక్షలు

జూ అధికారులకు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో ఆంధ్ర మెడికల్ కాలేజీ, కమ్యూనల్ మెడిసన్ సహకారంతో జూ పార్కులో శుక్రవారం జూనోటికల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. జూ పార్కు క్యూరేటర్ జి.మంగమ్మ, ఆంధ్రా మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ వేణి అవగాహన సదస్సును, ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు జునోటిక్ వ్యాధులు, వాటి నివారణ చర్యలు గురించి అవగాహన కల్పించారు. అనంతరం జూ సిబ్బందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. జూ వైద్యుడు ఫణీంద్ర, అసిస్టెంట్ క్యూరేటర్లు పి. గోపాలనాయుడు, బి.గోపి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భారతి, పురుషోత్తం పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.9 వేలు చెల్లించాలి

పెన్షనర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : ఇపిఎస్ 95 పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలని, మాజీ ఉద్యోగి పులి రమణారెడ్డి కోరారు. శుక్రవారం సిడబ్ల్యూసిలో నిర్వహించిన ఆల్ పెన్షనర్లు అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ, ఇపిఎస్ పెన్షనర్లకు ఇపుడు రూ.మూడు వేలకు మించి పెన్షన్ రావడం లేదన్నారు. హయ్యెస్ట్ పెన్షన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలిచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లింపుతో పాటు వైద్యసదుపాయం, డిఎ ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. అసోసియేషన్ జిల్లా నాయకులు సిహెచ్ నారాయణావు మాట్లాడుతూ ఇపిఎస్ పెన్షనర్లకు బియ్యం కార్డులు ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి హుస్సేన్ మాట్లాడుతూ ఈనెల 6,7,8 తేదీల్లో జంతర్‌మంతర్ వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు కె.దీనబంధు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పిట్ట గురునాథ్, నమ్మి అప్పలనాయుడు, కాకినాడ పెంటారావు, ములుగు పిల్లి పెంటయ్య ,సి శెట్టిఅప్పారావు, నమ్మి అప్పారావు, నరుపూడి వెంకటరావు, ఎన్‌వి. రమణ, సోమి సోమనాయుడు, సన్యాసిరావు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత

అవగాహన కల్పిస్తున్న జివిఎంసి అధికారులు

ప్రజాశక్తి- వేపగుంట : సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జివిఎంసి ఎనిమిదో జోన్ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి సూచించారు. శుక్రవారం జివిఎంసి 92వ వార్డు శ్రీరాంనగర్‌లో మలేరియా ఇన్స్పెక్టర్ దాలినాయుడు ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే నిర్వహించారు. ఇంటిలోపల, పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, కీటక డెంగీ, మలేరియా వ్యాధులపై అప్రమత్తంగా ఉండుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తడిపొడి చెత్తను వేరుచేసి, జివిఎంసి వాహనాలకు అందించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని మానేసి, ప్రత్యామ్నాయ గుడ్డ, నార సంచులను వాడాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించిన అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్ వెంకటరావుకు ఒకరోజు వేతనాన్ని కోత విధించాలని సూచించారు. శానిటేషన్ సూపర్వైజర్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ గోపి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎంత నిర్లక్ష్యం!

- అస్తవ్యస్తంగా బిఆర్‌టిఎస్ కనెక్టవిటీ రోడ్డు పనులు
- అడ్డగోలు నిర్మాణాలతో ప్రజలు, వాహనదారుల అవస్థలు

బిఆర్‌టిఎస్ రోడ్డు నిర్మాణంలో కప్పేస్తున్న మంచినీటి బోరు

ప్రజాశక్తి- సింహాచలం : అధికారుల పర్యవేక్షణ లోపంతో బిఆర్‌టిఎస్ రోడ్డు, కాలువల నిర్మాణం అస్తవ్యస్తంగా క్రమ పద్ధతి లేకుండా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బిఆర్‌టిఎస్ రోడ్లకు అనుసంధానంగా నిర్మించే రోడ్డు రోడ్లు వాహనదారులు పాదయారులు ప్రయాణించేందుకు వీలుగా లేవని, దీంతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కుమ్మరి దిబ్బ ప్రాంతంలో కనెక్టివిటీ రోడ్డు పూర్తిగా లోతుగా ఉండి ప్రయాణించే వీలు లేకుండా ఉంది అక్కడ ఉన్న మంచినీటి బోరుబావిని కప్పేస్తూ రోడ్డుకు, అడ్డంగా ఉన్న స్తంభాలను తీయకుండా రోడ్డు వేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టకుంటే అడ్డగోలు రోడ్డు నిర్మాణం వల్ల రానున్న వర్షాకాలంలో ఇళ్లల్లోకి వర్షపు నీరు ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి సరిచేయాలని కోరుతున్నారు.

ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం లేఖ

ప్రజాశక్తి -అనకాపల్లి

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు శుక్రవారం ఆయన లేఖ రాశారు. రెక్కల కష్టం మీద ఆధారపడిన వ్యవసాయ కూలీలకు ఎండలను సైతం లెక్కచేయకుండా పనులు చేస్తున్నారని తెలిపారు. వారు చేసిన పనులకు 7 వారాలుగా వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. జిల్లాలోని 24 మండలాల్లో తమ పార్టీ కార్యకర్తలు ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతాల్లో పర్యటించారని, ఈ సందర్భంలో వేతన బకాయిలు వున్నాయని, కనీసమైన మంచినీరు, టెంట్లు ఏర్పాటు చేయలేదని, ప్లేసిప్పులు కూడా ఇవ్వడం లేదని కూలీలు తమ ఆవేదనను వెళ్లగక్కారని తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని పెదపాడు, జగ్గన్నపేట, ఉప్పవరం, హరిపాలెం గ్రామాల్లో 4 వారాల నుండి వేతనాలు చెల్లించలేదని, జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి వుందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండగా, చేసిన పనులకు వేతనాలు రాకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి 100 రోజులు పనులు కల్పించాల్సి ఉన్నా రాజకీయ కారణాలతో నేడు ఆ పనులు ఆపేశారని పేర్కొన్నారు. వెంటనే కూలీలందరికీ పనులు కల్పించాలని, ఉపాధి హామీ కూలీల బకాయిలు మంజూరు చేయాలని, పని ప్రదేశాల్లో కూలీలకు మంచినీరు, మజ్జిగ, టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కోవిడ్ కాలం నుండి సోషల్ ఆడిట్ జరగకపోవడంతో కింది స్థాయిలో అవకతవకలు జరుగుతున్నట్లు అనేక అనుమానాలున్నాయని, వాటిని సరిచేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కూలి డబ్బులు చెల్లించాలని ఆందోళన

దేవరాపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు కూలీలకు వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యాన మండలంలోని తామరబ్బ పంచాయతీ పరిధి పాత బొడ్డపాడులో శుక్రవారం ఉపాధి హామీ కూలీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిటి దొర మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు నాలుగు వారాల నుండి డబ్బులు చెల్లించకపోతే వారి ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. గరిసింగి, వాలాబు, చింతలపూడి పంచాయతీలతో పాటు మండలం మొత్తం ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్ ఉన్న ఉపాధి హామీ బకాయిలను వెంటనే చెల్లించాలని, లేకుంటే కూలీలకు ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

అధ్యక్షులను సత్కరిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల

పలు పాల సంఘాలకు ఏకగ్రీవంగా అధ్యక్షుల ఎన్నిక

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని నాలుగు గ్రామాలలో విశాఖ డెయిరీ పాల సంఘాలకు డైరెక్టర్లు, అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని పి.భీమవరం పాల సంఘానికి వలివిరెడ్డి రాజబాబు, ఐతంపూడి సంఘానికి అప్పాన తాతబాబు, సీతయ్యపేట సంఘానికి నందవరపు రాజబాబు, గొర్లెపాలెం సంఘానికి సొంట్యాన శ్రీను అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వీరిని విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ శుక్రవారం సాలువతో సత్కరించి, నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డెయిరీ సూపర్వైజర్లు నాగేశ్వరరావు, ప్రసాదు, అప్పారావు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథ రథయాత్ర మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి గవరపాలెం అగ్రిమర్రిచెట్టు వద్ద గల జగన్నాథస్వామివారి దేవస్థానంలో ఈనెల 6 నుండి 16వ తేదీ వరకు స్వామివారి రథయాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఉత్సవ్ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ ఈవో రాజ సులోచన తెలిపారు. శనివారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి కళ్యాణం జరుగుతుందని, ఆదివారం ఉదయం ఆలయ వద్ద నుండి జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పది రోజులు స్వామివారు దశావతారాల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం వేళ ధార్మికప్రవచనాలు, భక్తి సంగీతం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. 16న తిరుగురథయాత్ర సందర్భంగా ఇంద్రజ్యుమ్న హాలు వద్ద భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆనకట్టలకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

శారదా నదిపై ఉన్న ఆనకట్టలకు మరమ్మతులు చేపట్టాలని తుమ్మపాల వ్యవసాయదారుల సంఘం డిమాండ్ చేసింది. శారదా నది నుంచి తుమ్మపాల, శంకరం, రేబాక, బగులువాడ, దిబ్బపాలెం పొలాలకు సాగునీరు వచ్చే తగరంపూడి ఆనకట్ట అనేకమైన వ్యర్థాలు, తుప్పలు, చెట్లతో నిండిపోయి నీటి సరఫరాకు ఆటంకంగా మారింది. ఈ నేపథ్యంలో సదరు సమస్యను అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు. శిథిలావస్థలో ఉన్న గేట్లు, అన్నదాతల కష్టాలను విన్న కొణతాల తక్షణ చర్యగా ఇరిగేషన్ డిపార్ట్మెంట్‌ని మరమ్మతులు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ఏఈ హనుమంతరావు కాలువల పరిస్థితిని, గేట్ల పరిస్థితిని పరిశీలించి నివేదిక తయారు చేశారు. సమస్యను ఉన్నతాధికారులతో సంప్రదించి కాలువ పూడిక, గేట్ల మరమ్మతులు చేస్తామని సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పూసపాటి భరత్ బాబు, తుమ్మపాల ఎంపిటీసీ చదరం నాగేశ్వరరావు, వ్యవసాయదారుల సంఘం సెక్రటరీ పెతకం శెట్టి బలరాం, మాజీ రైతు సంఘం ప్రెసిడెంట్ దొడ్డి సత్యఅప్పారావు, పీలా విశ్వేశ్వరరావు, టిడిపి నాయకులు కొణతాల వెంకటరమణ, పీలా తాతు నాయుడు, పీలా మురళి, కొణతాల అప్పలరాజు, రైతులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ పాలక వర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం 31 మంది సభ్యులతో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ రోటరీ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి రోటరీ క్లబ్ 2024-25 సంవత్సరానికి అధ్యక్షునిగా సరిపల్లి రాజేష్ కుమార్, సెక్రెటరీగా దేవత అనిల్, ట్రెజరర్‌గా గ్రంధి సత్యేంద్ర బాధ్యత స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గరుడ బుచ్చిరాజు హాజరయ్యారు. డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఇండక్షన్ ఆఫీసర్‌గా కోరుకొండ బుచ్చిరాజు వ్యవహరించారు. ఇన్సులేషన్ ఆఫీసర్ బిల్లపాటి చిదంబరం, అసిస్టెంట్ గవర్నర్ కె.మురళీ కృష్ణ వైద్యులు చార్టెడ్ అకౌంటెంట్లను దుస్సాలువలతో సత్కరించారు. నలుగురు వికలాంగులకు వీల్ చైర్స్ అందించారు. ఆడవారికి ఉపాధి నిమిత్తం ఎన్ గంగాభవానికి కుట్టుమిషన్ కడిమిసెట్టి సతీష్ సహకారంతో అందజేశారు. కోరుకొండ అరుణ బాక్సింగ్లో నేషనల్ లెవెల్ ఛాంపియన్షిప్ వారికి పారితోషికం ఇచ్చి సత్కరించారు. ఏపీ ఈసెట్ ఎగ్జామ్‌లో భీశెట్టి దివాకర్ స్టేట్ సెవెంత్ ర్యాంకు వచ్చినందున రోటరీ క్లబ్ సత్కరించి పారితోషికం అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్, లయన్స్ క్లబ్, భారత్ వికాస్ పరిషత్, వాసవి క్లబ్,ఇన్నర్ వీల్ క్లబ్ మహిళా, గ్రీన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సమాజంలో అట్టడుగు బలహీన వర్గాలైన ఎస్సీ ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీలు డివిజనల్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌కు నేషనల్ ఫోన్ ఫర్ సోషల్ జస్టిస్ జిల్లా కమిటీ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కమిటీల్లో ఎస్సీ ఎస్టీల్లో అన్ని కులాలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ప్రతినిధులు కొల్లి చిన అప్పారావు, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డేడ అప్పారావు, కట్టమూరి మంగరాజు పాల్గొన్నారు.

'శ్వాస మీద ధ్యాస'పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీ గౌరీ పంచాయతన దేవస్థానంలో శుక్రవారం జ్ఞానదాత నరేంద్ర ముదల్యర్ ఆధ్వర్యంలో శ్వాస మీద ధ్యాస కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్, ఆళ్ళ మహాలక్ష్మి నాయుడు, మళ్ల సురేష్, యల్లపు వెంకటరమణ, ఆళ్ళ ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి -కశింకోట

మండలంలోని ఉగ్గినపాలెం రైతు భరోసా కేంద్రంలో ఉగ్గినపాలెం, పరవాడపాలెం రైతులకు వరి విత్తనాలు గ్రామ రైతు భరోసా సహాయకులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలగ గున్నయ్య నాయుడు, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, కలగా సోమేశ్వరరావు, కలగా శ్రీను, బలిజి మునిలి నాయడు, గాలి శ్రీనివాసరావు, కలగా పార్వతి, గొంతిని లోవఅప్పారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని బంగారమ్మ పాలెం సచివాలయంలో గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నుమనాయుడు రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొడ్డి రాజ్ కోటి, దొడ్డి సోమేశ్వరరావు, దొడ్డి అప్పారావు, దాడి రమణ, సూరిశెట్టి రాము, వ్యవసాయ అధికారి అపర్ణ, సెక్రటరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్గిన పాలెంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న నాయకులు

జిల్లా అభివృద్ధిలో రవి పట్టన్‌శెట్టి కృషి మరువలేనిది

వీడ్కోలు సభలో నూతన కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి నూతన జిల్లాగా ఏర్పడిన తరువాత మొదటి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రవి పట్టన్ శెట్టి జిల్లాకు అందించిన సేవలు మరువలేనివని నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ కృష్ణన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో కలెక్టరుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులు రవి పట్టన్ శెట్టికి ఏర్పాటు చేసిన వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ కృష్ణన్ మాట్లాడుతూ 2013 సంవత్సరంలో ఐ.ఎ.ఎస్. అకాడమీలో తన సోదర సమానుడైన రవి పట్టన్ శెట్టితో కలసి ట్రెనింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లా అభివృద్ధిలో, పరిపాలనా నిర్ణయాలలో తన మార్క్‌ను రవి చూపించారన్నారు. జిల్లా అధికారుల సూచనలు సలహాలతో జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ఎస్‌పి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా కలెక్టరుగా రవి పట్టన్‌శెట్టి అందించిన సూచనలు సలహాల మేరకు జిల్లాలో శాంతిభద్రతలు, ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహించగలిగినట్లు చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టరు యం.జాహ్నవి మాట్లాడుతూ తన విధి నిర్వహణలో ఎన్నో చక్కని సలహాలు సూచనలు అందిస్తూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ల్యాండ్ రీసర్వే, డాటెడ్ ల్యాండ్స్, 22ఎ తదితర భూ సమస్యల పరిష్కారానికై వెన్నంటి నడిపించారని పేర్కొన్నారు. పలువురు జిల్లా అధికారులు రవి పట్టన్ శెట్టి సేవలను, ఆయనతో కలసి నిర్వహించిన విధులు గురించి గుర్తు చేసుకున్నారు. రవి పట్టన్‌శెట్టి మాట్లాడుతూ ప్రభుత్వ విధి నిర్వహణలో బదిలీలు సర్వ సాధారణమన్నారు. అనకాపల్లి జిల్లా కొత్తగా ఏర్పడిన సమయంలో కనీస వసతుల కల్పనకై కృషి చేసినట్లు చెప్పారు. అనకాపల్లి జిల్లాను తన జీవితంలో మరిచిపోలేనని, ఇక్కడ పని చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని తెలిపారు. చివరగా జిల్లా అధికారులు రవి పట్టన్ శెట్టిని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

బదిలీ అయిన కలెక్టర్ రవి పట్టన్‌శెట్టిని సత్కరిస్తున్న దృశ్యం

డైట్‌లో రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సెమినార్

ప్రజాశక్తి- అనకాపల్లి

స్థానిక దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) అటానమస్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఐపి నిర్వహణ, వాణిజ్యీకరణ వ్యూహాలు ఇన్‌హెచ్ ఈఐ, ఎన్ఆర్‌డిసి పాత్ర' అనే అంశంపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఎన్ఆర్‌డిసి సౌజన్యంతో జరిగిన ఈ సెమినార్‌లో ఎన్ఆర్‌డిసి డాక్టర్ భవ్య మంజీరా, నిహారిక, ఇంటలెక్చువల్ పేటెంట్ రైట్స్‌పై వివరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ సెమినార్ సమర్థవంతమైన మేధో సంపత్తి (ఐపి) నిర్వహణ, వాణిజ్యీకరణ ద్వారా సృజనాత్మకతను ప్రోత్సహించడానికి, ఆర్థికవృద్ధిని నడిపించడానికి ముఖ్యమైన మైలురాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ కే.దుర్గ శ్యాం ప్రసాద్, డీన్ ఈశ్వరరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణనాగ్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి గంగాధర్ గుప్తా, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు హేమంత్ కుమార్, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

రైన్ కోట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పారిశుద్ధ్య సిబ్బందికి రైన్ కోట్లు పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు దేశపాత్రునిపాలెం పరిధి 1, 2 సచివాలయాల పారిశుద్ధ్య సిబ్బందికి శుక్రవారం స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ చేతుల మీదుగా రైన్ కోట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ క్రమశిక్షణతో అంకిత భావంతో పని చేయాలని, ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో రెండు సచివాలయాల శానిటరీ సెక్రెటరీలు గంగు నాయుడు, కనకరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు ఎస్టిమేషన్

ప్రజాశక్తి - పరవాడ : గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి లంకెలపాలెం పరిసర ప్రాంతాలలో వీధిలైట్లకు స్తంభాలు, లైన్లు వేయడానికి జీవీఎంసీ, ఇపీడీసీఎల్ అధికారులతో ఎస్టిమేషన్ వేసే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, రామారావు, అప్పారావు పాల్గొన్నారు.

జెఎస్ఎం చర్చిలో సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : జీసస్ గాస్పల్ ట్రైబల్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యాన అనంతగిరి మండలం జీనబాడు జెఎస్ఎం చర్చిలో పాస్టర్ దేవరాజు ఆధ్వర్యాన క్రైస్తవుల సమావేశం శుక్రవారం జరిగింది. ఇందులో చుట్టు పక్కల ప్రాంతాల దైవ సేవకులు, విశ్వాసులు పాల్గొనగా, ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన నిస్సి మినిస్ట్రీస్ అధినేత రెవ బిషప్ టైటస్ గొర్లె, గ్రేస్ టైటస్ దంపతులు ప్రత్యేకమైన సందేశాన్ని అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీసస్ గాస్పల్ ట్రైబల్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ యు.జాను, సెక్రటరీ దేవరాజు, వైస్ ప్రెసిడెంట్ ఇమ్మానియేల్, ట్రెజరర్ మింట్సాల్, అడ్వైజర్ కె.దావీదు, జయరాజు కాశీపురం సీయోను ప్రార్థన మందిరం సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు బాలికల హాకీ సబ్ జూనియర్స్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - యలమంచిలి : అనకాపల్లి జిల్లా బాలికల హాకీ సబ్ జూనియర్స్ జట్టు ఎంపిక ఆదివారం జరుగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి కొరారు నరేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో జరగనున్న అంతర్‌జిల్లా సబ్ జూనియర్ బాలికల హాకీ పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి గల అభ్యర్థులు ఆదివారం ఉదయం 9.30 గంటలకు యలమంచిలి డిగ్రీ కాలేజ్ గ్రౌండ్‌కు హాజరు కావాలని కోరారు. అభ్యర్థులు 2008 తర్వాత జన్మించిన వారై ఉండాలని నరేశ్ తెలిపారు.

పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం ఊడేరు గ్రామంలో జల్ జీవన మిషన్ పథకంలో ద్వారా నిర్మించిన మంచినీటి కుళాయిల పైపులకు కొన్ని నెలలుగా లీకేజీ అవుతుండడంతో శుక్రవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. పైప్ లైన్ లీకేజీ వల్ల నీరు కలుషితమై ఆరోగ్యాలు దెబ్బతింటాయని స్థానికులు శుశుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ వార్తను సోషల్ మీడియాలో చూసిన పంచాయతీ సిబ్బంది, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ స్పందించి గ్రామ సర్పంచ్ సిరిగిరి శెట్టి కృష్ణమోహన్, మాజీ ఉపసర్పంచ్ దండుపాటి గంగరాజు, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ సిబ్బంది రోజా, ఏఎన్ఎం సమక్షంలో లీకేజీ పైపులను రిపేర్ మరమ్మతులు చేపట్టారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండలం తుమ్మపాల మండల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గుంటూరు ఆంధ్రప్రదేశ్ జీవ వైవిద్య మండలి, శారదా వేలీ డెవలప్మెంట్ సమితి సంయుక్తంగా మొక్కలు నాటు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సమితి ఆపరేషన్ మేనేజర్ కర్రి చైతన్య, ప్రముఖ యోగా గురువు బుదిరెడ్డి నర్సింగరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ జీవ వైవిధ్యం కలిగిన మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డు సహకారంతో ఈ మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది చక్రవర్తి, జయ, జీవిఎల్ నాయుడు, కోన అప్పారావు పాల్గొన్నారు.

రేపు కూటమి విజయోత్సవ ర్యాలీ

సమావేశంలో పాల్గొన్న ఎన్‌డిఎ కూటమి నాయకులు

ప్రజాశక్తి-దేవరాపల్లి

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి తరుపున విజయం సాధించిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ విజయోత్సవ ర్యాలీ ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తెలిపారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద శుక్రవారం మండలస్థాయి కూటమి ముఖ్య నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరిగే విజయోత్సవ ర్యాలీలో మండల స్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గొర్రెపోటు రామ్మూర్తి నాయుడు, సోమిరెడ్డి గోవింద, పెద్దాడ వెంకటరమణ, చల్లా నానాజీ, కిల్లి గోవింద, కడిమి నాగేశ్వరరావు, పెంటకోట అప్పలనాయుడు, గుల్లిపల్లి అర్జున, గొర్లె దేవుళ్ళు తదితరులు పాల్గొన్నారు.

రేపు విజయోత్సవ సభ

కె.కోటపాడు : ఈ నెల7వ తేదీన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎంపీ సిఎం.రమేష్ విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మహేష్ మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు సిఎం రమేష్‌కు చౌడువాడలో స్వాగతం పలకనున్నట్లు చెప్పారు. అనంతరం అనంతరం రావాలమ్మతల్లి ఆలయ సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో విజయోత్సవ సభ జరుగుతుందని చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు జూరెడ్డి రాము, లెక్కల మల్లేశ్వరరావు, కన్నూరు సూర్యనారాయణ, కశిరెడ్డి అప్పలనాయుడు, సబ్బవరపు రామునాయుడు, పూడి నారాయణమూర్తి, పూడి శ్రీనివాసరావు, యడ్ల రమేష్, రెడ్డి రామస్వామి, వంటాకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్లకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

: పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టాలని జీవీఎంసీ 80వ వార్డు (పాత 23వ వార్డు) అధ్యక్షులు బొడ్డేడ మురళి, వార్డు టిడిపి అధ్యక్షులు బిఎస్ఎన్మే జోగినాయుడుకు వార్డుకు చెందిన పలువురు మహిళలు విజ్ఞప్తి చేశారు. చినరామస్వామి కోవెల వెనుక ఉన్న జీవిఎంసి ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంక్ నీటి కుళాయిల పైపులైన్లు దేవుడుతోట, విల్లూరి అక్కయ్య నాయుడు గారి వీధి, మెండెగూడెం, విల్లూరి జోగి నాయుడు గారి వీధి పైపు లైన్లు పూర్తిగా పాడై ప్రజల వినియోగంలో లేకుండా పోయాయని పేర్కొన్నారు. దీంతో వారు సంబంధిత అధికారి ఏతతో మాట్లాడి కొత్త పైపులైన్లు మంజూరు చేసి వెంటనే సమస్యను పరిష్కారం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు విల్లూరి రమణబాబు బుద్ధ ఈశ్వరరావు సూరిశెట్టి రాముడు కాంగ్రేగుల బుజ్జి కర్రి శివ దాడి త్రినాద్ డి చిన్నోడు మహిళలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహకారం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణం గాంధీనగర్‌కు చెందిన డాన్స్ ఈవెంట్ ఆర్గనైజర్ ఫరీద్ ప్రమాదానికి గురై కొన్ని నెలలుగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రముఖ సంఘ సేవకులు గోల్డ్ వాసు సహాయం అందించారు. ఫరీద్ ప్రమాదానికి గురి కావడంతో ఆయన పిల్లలు చదువుకు కూడా ఇబ్బందులు ఉన్నాయని తెలిసి మళ్ల రాంబుజ్జి గోల్డ్ వాసు ముందుకు వచ్చి వారి కుటుంబానికి మూడు నెలలకు సరిపడా సరుకులు, బియ్యం, పిల్లలు పుస్తకాలకు 5వేల రూపాయల నగదు టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గోల్డ్ వాసు, పోలమరశెట్టి చందు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి -అనకాపల్లి : స్థానిక గాంధీ నగరం ఏరియా ప్రభుత్వ పశు వైద్యశాలలో జునోసిస్ డే సందర్భంగా శనివారం పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేయడం జరుగుతుందని పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమాన్ని పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యలపై 'గ్రీవెన్స్ డే'

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినతులు స్వీకరించేందుకు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడుగురు పోలీసు సిబ్బంది హాజరై వారి అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఎస్పీ విన్నపాలను పరిశీలించి, సానుకూలంగా స్పందించి, అర్హమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

తహశీల్దార్ అకాల మరణం

చలమయ్య (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి- సబ్బవరం : సబ్బవరం తహశీల్దార్ జె.చలమయ్య అనారోగ్యంతో గురువారం రాత్రి తన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో మరణించినట్లు డిప్యూటీ తహశీల్దారు వెంకట్ ఒక ప్రకటనలో తెలిపారు. చలమయ్య సార్వత్రిక ఎన్నికలకు ముందు శ్రీకాకుళం జిల్లా నుంచి సబ్బవరం తహశీల్దారుగా వచ్చారు. చలమయ్య తీవ్ర అనారోగ్య కారణంగా రెండు నెలలుగా సెలవులో ఉంటూ చికిత్స పొందుతున్నారు. అయితే దురదృష్టవశాత్తు ఆయన గురువారం రాత్రి మరణించారు. తహశీల్దారు మృతికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది, పలువురు నేతలు ప్రగాఢ సంతాపం తెలిపారు.

జూనోసిస్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే భయంకరమైన జూనోటిక్ వ్యాధిపై మండలంలోని కన్నూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నూరుపాలెం పశు వైద్యాధికారి మర్రి దయానా మాట్లాడుతూ జులై 6న ప్రపంచ జూనోసిస్ దేను పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కుక్కల ద్వారా వ్యాపించేదే అతిభయంకర వ్యాధి రేబిస్ అని తెలిపారు. ఈ నెల 6న అన్ని పశువుల ఆసుపత్రిలో యాంటీ రేబీస్ టీకాను కుక్కలకు వేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంలో అతిసార నివారణకు తీసుకోవలసిన చర్యలపై శుక్రవారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తురకలపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంధ్యారాణి మాట్లాడుతూ వేడి చేసి చల్లార్చిన నీటిని తాగడం వలన అతిసార రాకుండా ఉంటుందని చెప్పారు. వర్షాకాలంలో వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు అతిసార నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి గ్రామంలో ఈ నెల 7న జరగనున్న ఉచిత మెగా మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ శివలంక లక్ష్మి, ఉప సర్పంచ్ కెబోచ్చి సత్యనారాయణ, వార్డు సభ్యులు చెల్లయ్యమ్మ, పి.లక్ష్మి, సత్యవతి, బి.లక్ష్మీముత్యాలు గోవింద్, ఎం సురేష్, యువకులు గౌతం, కె రాజు, శ్రీను, వై రాజు, నాని, ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఆసక్తిగల అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం వెంకట లక్ష్మమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15లోగా http:/nationalaeardstoteachers.education.gov.in వెబ్సైట్లో పరిశీలించి ఆన్లైన్లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

తుప్పలు ఇలా.. వెళ్లేది ఎలా..

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలోని పలు గ్రామాలలో ప్రధాన రహదారులు అనుకుని తుప్పలు విపరీతంగా పెరిగి పోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంకటాపురం, నీలిగుంట, అన్నవరం, అడ్డ రోడ్డు వెళ్లేరహదారి సహ గ్రామీణ ప్రాంతాల రహదారులకు ఇరువైపులా తుప్పలు పేరుకు పోయాయి. దీంతో, వాహనాలపై వెళ్లే వారికి ఎదురుగా వస్తున్న కనిపించలేదు. ముల్లకంచె తుప్పలు కొన్ని ప్రాంతాల్లో దారికి అడ్డంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోని కనీసం ఉపాధి హామీ నిధులతో గ్రామీణ ప్రాంత రహదారులకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభానికి నోచని రైతు భరోసా కేంద్రాలు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో సచివాల యాల పరిధిలో గత వైసిపి ప్రభుత్వం నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు నేటికీ ప్రారంభానికి నోచుకోక పోవడంతో ఆయా ప్రాంత ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి భవనాలు వృథాగా ఉండటంతో పలువురు మండలం నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. అత్యధిక రెవెన్యూ భూములు ఉన్న గ్రామాలు చిన బొడ్డేపల్లి, పీకే పల్లిలో రైతు భరోసా కేంద్రాలు నిర్మించి సుమారు నాలుగు నెలలు అవుతుంది. క్రితం చిన బొడ్డేపల్లి గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి సక్రమంగా దారి లేక పోవడం విశేషం. కూటమి ప్రభుత్వంలోనైనా నిర్మించిన నూతన భవనాలు ప్రారంభించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

దారి లేకుండా ఉన్న రైతు భరోసా కేంద్రం

కవాతు చేపడుతున్న నాయకులు

వర్గీకరణకు పోరాటాలు

ప్రజాశక్తి - చీడికాడ:ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి ఈనెల 7వ తేదీకి 30 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మహజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షులు రావాడ దేముడు న్నాయుడు ఆధ్వర్యంలో గురువారం రాత్రి మండల కేంద్రంలో ఘనంగా కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహజన సోషలిస్ట్ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఏలుసూరి ఘాటీలు మాదిగ కవాతులు నిర్వహించారు. అనంతరం మాదిగల ఉద్యోగుల సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తా శ్రీనివాసరావు మాట్లాడుతూ, మాదిగల చిరకాల ఆకాంక్ష ఎబిసిడి వర్గీకరణ కోసం కృష్ణమాదిగ పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యువకులు రావాడ రాము, మంజేటి నాగరాజు, బెన్నవోలు నారాయణరావు, కంటిపాము సంతోస్, కంటిపాము ఈశ్వరరావు పాల్గొన్నారు.

వైసిపి నేతలపై కేసు

ప్రజాశక్తి - చీడికాడ:తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఉన్న కార్యకర్తలను కొట్టిన సంఘటనలో వైసిపీ నాయకులు, కార్యకర్తలపై పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. చీడికాడ మండలం అప్పలరాజుపురం గ్రామంలో ఉన్న టీడీపీ పార్టీ కార్యాలయంలో గురువారం రాత్రి 8 గంటల సమయంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను వైసిపి నాయకులు కార్యకర్తలు కొట్టినట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సిఐ స్వామి నాయుడు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

కోర్కెల దినాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:లేబర్ కోడ్స్ రద్దు, కార్మిక హక్కులపై ఈ నెల 10న జరిగే కోర్కెల దినాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు కోరారు. శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో టి.ఈశ్వరరావు అధ్యక్షతన అంగన్వాడీ, ఆశ, మీడ్డేమిల్స్ తదితర కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు తీవ్ర నష్టం చేస్తుందన్నారు. నూతన రవాణా చట్టం, ఇతర చట్టాలను బిజెపి మార్చేస్తుందన్నారు. జూలై 10న జరిగే దర్నాని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడ్డేమీల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రసన్న, అంగన్‌వాడి ప్రాజెక్టు నాయకులు వి.సామాజ్యం, మహాలక్ష్మీ, రమణమ్మ, వెంకటలక్ష్మీ, ఆశా నాయకులు ఆరుణా, అమ్మాజీ, పార్వతి తదితర్లు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

టిడిపి నేతల ఆందోళన

ప్రజాశక్తి-రోలుగుంట:మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహంకు గల చేతికి ఉన్న వాచ్‌ను ధ్వంసం చేయడమే కాకుండా సీఎం చంద్రబాబు, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ఉన్న ఫ్లెక్సీ బోర్డును కట్ చేసి వారిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని జానకిరాంపురం గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు గురువారం రాత్రి ఆందోళన చేపట్టారు. అదే గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన యువకులు ఈ చర్యలకు పాల్పడ్డారంటూ రోలుగుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్ ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. మాజీ సర్పంచ్ లగుడు సత్తిబాబు ఫ్లెక్సీ బోర్డును కొత్తగా ఏర్పాటు చేయాలని, విగ్రహ వాచ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఇరువర్గాల అంగీకరించడంతో గొడవ సర్దుమనిగింది.

నినాదాలు చేస్తున్న నాయకులు

విత్తనాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో పుత్తడిగైరంపేట ఆర్ బి కే ద్వారా శుక్రవారం రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. పుత్తడి గైరంపేట మాజీ సర్పంచ్ పత్తి సత్తిబాబు టిడిపి బూత్ కన్వీనర్ రూపల నాయుడు ల ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్తరకం వరి విత్తనాలను ఉపయోగిస్తే తెగుళ్ళ తగ్గి దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నారాయణరావు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ వసంత, పలువురు రైతులు పాల్గొన్నారు.

చేపడుతున్న పనులు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో సిహెచ్ నాగపురంలో పంచాయతీ పరిధిలో సర్పంచ్ ఎలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ప్రారంభించారు. గ్రామానికి ప్రారంభంలో ఉన్న వంతెన వద్ద ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న అపారిశుధ్యాన్ని యంత్రాలతో తొలగించారు.

అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారులు

జూనోసిస్‌పై అవగాహన

ప్రజాశక్తి - చీడికాడ:జంతువులకు సంక్రమించే జూనోసిస్ (జంతు) వ్యాధులు పట్ల అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మండలంలోని పశు వైద్య శాలలు, రైతు కేంద్రాల పరిధిలో ఉన్న పాఠశాలల్లో పశు వైద్యాధికారులు రైతు సేవా కేంద్రాల సిబ్బంది జంతు సంక్రమిత వ్యాధులు పట్ల అవగాహన సదస్సు లు నిర్వహించారు.ఇందులో భాగంగా పశు వైద్యాధికారులు చీడికాడ, చుక్కపల్లి, తురువోలు బైలపూడి, అప్పలరాజుపురం పాఠశాలలో పశువుల నుంచి సంక్రమించే అంటు వ్యాధులు గురించి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పెంపుడు జంతువుల పశువుల నుండి మనుషులకు సంక్రమించే రేబిస్, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, బర్డ్ ఫ్లూ, స్వైన్ ఫ్లూ, మెదడు వాపు, చర్మ వ్యాధులు, ప్లేగు, హైపటైటిస్ వంటి వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకా మందులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు రాధమ్మ ఎల్ఎస్ఎ వర్మ, విఏ దుగ్గిరాల మనోజ్ కుమార్, పశుసంవర్ధక సహాయకులు రాజేష్, అర్జున్ మూర్తి, సాయి, శేషు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

8న వైఎస్ఆర్ జయంతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 8దీన వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, అందుకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేయాలని పట్టణ వైసీపీ అధ్యక్షుడు ఏకా శివ సూచించారు. మాజీ శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదేశాల మేరకు నాలుగు మండలాలు, మున్సిపాలిటీలోనూ మహానేత జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఇకనుంచి పార్టీ తరపున కార్యక్రమాలు నిర్వహించాలని నాయకులు కార్యకర్తలు చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ సూచించారని శివ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నో హామీలు ఇచ్చిందని అవి ఏ మేరకు నెరవేరుస్తుందో వేచి చూడాలన్నారు.

అప్రెంటిస్ మేళా

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఈ నెల 8న నర్సీపట్నం ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ డి.శ్రీనివాసచారి తెలిపారు. ఈ అప్రెంటిస్ మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఆసక్తి కల అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ వెంట ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలు తెచ్చుకోవాలని తెలిపారు.

బాలికను తండ్రికి అప్పగింత

ప్రజాశక్తి- కలెక్టరేట్:ప్రేమ పేరుతో ఇంట్లో చెప్పకుండా ఒడిశా రాష్ట్రం నుంచి నగరానికి ఒక యువకునితో కలిసి వచ్చిన 14 ఏళ్ల మైనర్ బాలికను, తిరిగి ఆమె తండ్రికి అప్పగించారు. ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపిన సమాచారం మేరకు, సుమిత్ర మహారణ అనే 14 ఏళ్ల బాలిక ఒడిశా నుండి ఒక అబ్బాయితో వచ్చింది. ఒడిశాలో ఈ అమ్మాయి పేరు మీద మిస్సింగ్ కేసు కూడా నమోదు అయ్యింది. విశాఖలో ఆర్ పిఎఫ్,ఎయు టిడిపి సిబ్బంది కలిసి చేసిన రెస్క్యూలో సుమిత్రను గుర్తించి టిఎస్ఆర్ మహిళా షెల్టర్‌కు తరలించారు. శుక్రవారం ఒడిశా నుంచి వచ్చిన తండ్రి అక్షయ మహారణ, ఒడిశా పోలీస్ ఎస్ఐ లకు సుమిత్రను ఎయుటిడి సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు అప్పగించారు.

'పోలీసులపై చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:మైనర్ యువకుని పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్య తీసుకోవాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు పాల్తేటి పెంటారావు డిమాండ్ చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అదృశ్యమైన బాలుడిని పట్టుకొని పోలీసులు అతనిని, ఆమె తల్లిని వేధించడం సరికాదన్నారు. దీనిపై సిపికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. బాలుని తల్లి సత్యవతి మాట్లాడుతూ, తన ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారని, అకారణంగా నేరం ఒప్పుకోమని తనను, కుమారుడు తేజాను వేధించారని ఆరోపించారు. పోలీసులు కొట్టడంతో తన కుమారుడు తేజ చేయి విరిగి పోయిందని, పోలీసులు, వైద్యులు తమకు న్యాయం చేయలేదని ఆరోపించారు.

అల్లూరి పేరు పెట్టాలి

ప్రజాశక్తి-గొలుగొండ:అల్లూరి పట్ల ముఖస్తుతి కార్యక్రమాలు కాకుండా ఆయనకు శాశ్వత యశస్సు వచ్చే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించాలని జాతీయ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు కోంతారు. అల్లూరి విగ్రహాన్ని పార్లమెంటు భవనంలో ఏర్పాటు చేయాలన్నారు. అల్లూరి పేరున 125 రూపే నాణాన్ని విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అల్లూరికి 'భారతరత్న' ఇవ్వాలని, పోలవరం ప్రాజెక్టుకు, అల్లూరి నడయాడిన రాజమహేంద్రవరం పుష్కర్ ఘాటు నుండి ఉన్న రైలు వంతెనకు అల్లూరి పేరు పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అల్లూరిపై చిత్తశుద్ధి ఉంటే ఆయన పేరు చిరస్థాయిగా ఉండేటట్టు ఆయన పేరు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

స'జీవ' శిల్పాలు

-పలు రాష్ట్రాల నుంచి తయారీకి ఆర్డర్లు
-శిల్పి రాజు నైపుణ్యంపై పలువురు ప్రశంసలు

అపురూప శిల్పం

విగ్రహాన్ని చెక్కుతున్న శిల్పి రాజు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట కు చెందిన శిల్పి నక్కా రాజు పలు విగ్రహాలు తయారీలో ఘనత సాధిస్తున్నాడు. జీవం ఉట్టి పడేలా అనేక రకాల విగ్రహాలు తయారీ చేస్తూ పలువురు మన్ననలు పొందుతున్నాడు. శిల్పి రాజు చేతిలో దేముళ్ళ విగ్రహాలతో పాటు పలువురు రాజకీయ నాయకులు విగ్రహాలు తయారీ అవుతుంటాయి. దేశంలో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు వారికీ కావాల్సిన విగ్రహాలు తయారీకి ఆర్డర్ ఇస్తుంటారు. బుద్ధుడు, అంబేద్కర్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్, మాజీ ప్రధానుల విగ్రహాలతో పాటు స్థానిక రాజకీయ నాయకుల విగ్రహాలు తయారీకి ఆర్డర్ వస్తుంటాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ కంపిని ప్రతినిధులు భారీ బుద్ధుడు విగ్రహం తయారీ కి ఒప్పందం చేసుకోగా చెన్నైకి చెందిన మరో సంస్థ అబ్దుల్ కలామ్ విగ్రహం తయారీ చేయించుకున్నారు. రావికమతం మండలం చినపాచిల మాజీ సర్పంచ్ శంకరరావు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందటంతో ఆయన విగ్రహన్ని గ్రామస్తులు తయారీ చేయించు కున్నారు.

రైతు - జోడి ఎడ్లతో దుక్కి దున్నతున్నట్టు.. మరో విగ్రహం తయారీ చేసి శిల్పి రాజు తన కళా నైపుణ్యం చూపించాడు. అలాగే శిల్పి రాజు చేతిలో వెంకటేశ్వర స్వామి, దుర్గా దేవి, షిరిడి సాయి బాబా ఇతర దేవుళ్ళ విగ్రహాలు జీవం ఉట్టి పడేలా ఉంటాయి.

ప్రతి ఏటా మహా శివ రాత్రి సందర్భంగా కొత్తకోట జిల్లా పరిషత్ ఆవరణలో నిర్వహించే మహా జాగరణ కు భారీ శివుని విగ్రహన్ని మట్టితో తయారీ చేస్తుంటాడు. వినాయక చవితి సందర్భంగా గత ఏడాది స్థానిక సిద్ది వినాయక సంఘం సభ్యులు సుమారు 30 అడుగుల భారీ మట్టి గణపతి విగ్రహం శిల్పి రాజు తో తయారీ చేయించి గ్రామీణ ప్రాంతంలో రికార్డు సృష్టించారు.

బుద్ధుడి విగ్రహాన్ని చెక్కుతున్న శిల్పి రాజు, కళాకారులు

సాయిబాబా శిల్పం

అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:అల్లూరి శత వర్ధంతి వార్షిక నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 127 వ జయంతి కార్యక్రమం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి అల్లూరి శత వర్ధంతి వార్షిక నిర్వహణ కమిటి కార్యదర్శి ఎస్.గోవింద రాజులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అల్లూరి వీరోచిత పోరాటం చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు దాటుతున్నా, ఆదివాసీల దుస్థితిలో మార్పు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల వేదిక నాయకులు ఎం.శరత్ మాట్లాడుతూ, ప్రకృతి వనరులను, దేశ సంపదను ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు కట్ట బెడుతున్నాయన్నారు. దేశ విపత్కర పరిస్థితుల్లో అల్లూరి వంటి విప్లవ వీరులు నిర్వహించిన పోరాటం అవసరమన్నారు. పౌర చైతన్య వేదిక నాయకులు సిహెచ్ ప్రమీల, డాక్టర్ పొన్నాడ శ్రీనివాస రావు, ఎఐడిఎస్ఓ నాయకులు కె.అభిలాష్, బి.సంతోష్, కె.శివప్రసాద్ పాల్గొన్నారు.

75 స్వయం సహాయక సంఘాలకు..

రూ.3 కోట్ల ఆర్థిక సాయం : అల్లూరి కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: ఐటిడిఎ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో పాడేరు మండలంలోని 75 స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు మూడు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులతో మాట్లాడిన కలెక్టర్ వారు ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొనే తీరును ఆరా తీసారు. ప్రతినిధులు స్పందిస్తూ కూరగాయల, చిల్లర సరుకుల, బట్టల వ్యాపారాలు చేసుకుంటామని వివరించారు. మరికొందరు వారపు సంతలలో అవసరమైన నిత్యావసర సరుకులు అమ్ముతామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ వారపు సంతలలో దళారులు నాణ్యత లేని సరుకులు, కల్తీ సరుకులు అధిక ధరలకు అమ్ముతు గిరిజన వినియోగదారులను మోసం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మంచి నాణ్యతతో కూడిన కల్తీ లేని సరుకులు అమ్మితే స్వయం సంఘాలు బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. పంచాయతీ తరుపున వ్యాపారుల నుండి అధిక మొత్తాలు సేకరించి పంచాయతీలకు చెల్లించకుండా దళారులు తీసుకుంటూ పంచాయతి ఆదాయానికి గండి కొడుతున్నట్లు కూడా తన దృష్టికి వచ్చిందని, ఇటువంటి సంఘటనలు జరగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు.

బాల యాచకులు లేని నగరంగా తీర్చిదిద్దరూ..

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖ నగరాన్ని బాల యాచకులు లేని విధంగా తీర్చిదిద్దేందుకు నగర పోలీసు యంత్రాంగం అడుగులు వేయాలని నూతన పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం కోరారు. శుక్రవారం ఉదయం కమిషనర్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసిన సీతారాం కాసేపు భేటీ అయ్యారు. బాల యాచకుల సమస్యలను కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబేషనరీ అధికారి శరత్ కుమార్, చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం విశాఖ నగర కన్వీనర్ కె.ఎల్లయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి- కోటవురట్ల:మండలంలో ఎండపల్లి ఫీడర్ పరిధిలోని సుంకపూరు, జల్లూరు, తంగేడు, బి కే పల్లి, గ్రామాలలో జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా ఈనెల 6న శనివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని స్థానిక విద్యుత్ శాఖ ఇంజనీర్ మహేష్ తెలిపారు.

బెస్ట్ అవైలబుల్ విధానాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:వైసిపి ప్రభుత్వం రద్దు చేసిన జివో 61 ప్రకారం బెస్ట్ అవైలబుల్ పథకాన్ని తిరిగి నూతన కూటమి ప్రభుత్వం కొనసాగించాలని దళిత హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతాడ జోగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,వైసిపి ప్రభుత్వం దళితులకు చెందిన అనేక పథకాలను రద్దు చేసిందన్నారు. వాటన్నింటినీ తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

సిల్వర్ ఓక్ మొక్కల పంపిణీ

ప్రజాశక్తి- పెదబయలు:మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సీతగుంట పంచాయతీకి సంబంధించి ఏడుగురు రైతులకు ఎంపీపీ బోండా వరహాలమ్మా చేతుల మీదుగా సిల్వర్ ఓక్ మొక్కలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, మొక్కలకు ఎరువులు వేసుకొని నాటుకోవాలన్నారు. ఎంపీడీవో విగ్గేష్ మాట్లాడుతూ, మొక్కలు అందించడంతో పాటు మెయింటెనెన్స్ ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.